# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 107 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

22-02-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# స్పందించని యంత్రాంగం




**రోడ్డుపై గోతులను కప్పని ఆలయ అధికారులు**

- పండుగ ఏర్పాట్ల పేరిట తవ్విన గోతులు అలాగే వదిలివేత
- అరసవల్లి ప్రధాన రహదారిపై వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- ప్రమాదాలకు కారణమవుతున్న రోడ్డు దుస్థితి - ప్రజల ఆందోళన
- పండుగ ముగిసినా మరమ్మతులు చేపట్టని అధికారులు
- వెంటనే స్పందించి రహదారి సరిచేయాలని స్థానికుల డిమాండ్
- నిర్లక్ష్యంపై యంత్రాంగం చర్యలు తీసుకుంటుందా అనే ప్రశ్న

**నవతరం ప్రతినిధి శ్రీకాకుళం**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండో దఫా రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఈసారి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. తొలుత ఏడు రోజుల పాటు నిర్వహించాలని భావించినప్పటికీ అనివార్య కారణాలతో మూడు రోజులకు పరిమితం చేశారు. పండుగ సందర్భంగా జిల్లా కేంద్రంలో హెలికాప్టర్ సేవలు ఏర్పాటు చేయడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సవాలు విజయవంతం కావడంలో సహకరించిన వారికి అధికారులు విందు భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే, ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా అరసవల్లిలో క్యూలైన్ల ఏర్పాటుకు ప్రధాన రహదారిపై పలు చోట్ల గోతులు తవ్వారు. ప్రతి సంవత్సరం పండుగ ముగిసిన వెంటనే గోతులను పూడ్చి రహదారిని యథాస్థితికి తీసుకురావడం ఆనవాయితీగా కొనసాగుతున్నప్పటికీ ఈసారి మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుతం రోడ్డుపై గోతులు అలాగే ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గోతులు స్పష్టంగా కనిపించక ప్రమాదాలకు దారితీసే పరిస్థితి నెలకొంది. స్థానిక వ్యాపారులు, భక్తులు కూడా ఈ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాన రహదారిపై గోతులు ఉండటం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, వెంటనే స్పందించి రహదారిని సరిచేయాలని ప్రజలు ఆలయ అధికారులను, సంబంధిత యంత్రాంగాన్ని కోరుతున్నారు. దీనిపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

## పారిశ్రామిక విపత్తులపై అప్రమత్తతకు మాక్ డ్రిల్

- సైరన్ మోగగానే రంగంలోకి రక్షణ బృందాలు
- క్లోరిన్ లీకేజీ అత్యవసర పరిస్థితులపై విన్యాసం
- శ్రేయాస్ ఇండస్ట్రీస్ వద్ద భారీ 'ఆఫ్-సైట్' మాక్ డ్రిల్ విజయవంతం

2లో






## మత్స్యకారుల కుటుంబాలకు పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల

**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి**

**నవతరం -అమరావతి, ఫిబ్రవరి**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా



భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## గొండు గంగాధర్ సేవలకు ప్రశంసలు ఉంగటి రమణ అభినందనలు

- పేదలకు అందుబాటు వైద్యం అందిస్తున్న వైద్యుడిగా గుర్తింపు
- మీనాక్షి హాస్పిటల్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు
- వైద్యరంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్ష
- ప్రజలకు సేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచన
- అభిమానులు, నాయకుల సమక్షంలో ఘనంగా జన్మదిన వేడుకలు
- డాక్టర్. గొండు గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలియజేసిన ఉంగటి...

2లో



ఎడిటోరియల్

# 'హిమంత' ద్వేషం!

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ చేస్తున్న విద్వేషపూరిత వ్యాఖ్యలు, చేసే హావభావాల ప్రదర్శనలు మతసామరస్యాన్ని తెబ్బతీసే విధంగా ఉన్నాయి. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి అధికారంలోకి వచ్చిన వ్యక్తులు నేరుగా ఒక వర్గాన్ని టార్గెట్ చేసుకుని మాట్లాడటం పౌరులను అభద్రతలోకి నెట్టడమే తప్ప వేరేకాదు. అస్సాం యూనిట్ ట్విట్టర్‌లో పోస్టు చేసిన హిమంత వీడియోలో తన చేయిని తుపాకివలే పెట్టి కాల్చేస్తామ న్నట్లుగా అందులో విజువల్ ఉంది. అయితే, అది ముస్లింల మైనార్టీలను టార్గెట్ చేస్తూ దేశం నుంచి వెళ్లగొట్టే కుట్రలో భాగంగా చేసిందేనని విమర్శలు వచ్చాయి. తర్వాత తొలగించినప్పటికీ గతంలో ఆయన చేసిన వ్యాఖ్యలు విభజన ఆలోచనలకు బలాన్ని చేకూర్చాయి. ఒక రాష్ట్రానికి అత్యున్నతమైన పదవిలో ఎన్నికైన వ్యక్తి అన్ని కులాలు, మతాలను సమానంగా చూడాలి, గౌరవించాలి. ఎందుకంటే వారు వేసే అడుగు, చెప్పే మాట ప్రభావితం చేస్తుంది. కానీ, హిమంత పాలన మాత్రం 'విభజించు పాలించు' సూత్రంతో హిందూ, ముస్లింల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేస్తున్నది. దీన్ని అడ్డుకోకపోతే ఇంతకన్నా దేశానికి వేరే ప్రమాదం ఏమీ ఉండదు! దేశం కుల, మత, ప్రాంత రాజకీ యాలతో అట్టుడుకుతున్నది. గల్లీ నుంచి మొదలుకుంటే ఢిల్లీ దాకా సంఘ్ పరివారం వికటహాసాన్ని ప్రదర్శిస్తున్నది. భిన్నత్వంలో ఏకత్వానికి అడుగడుగునా తూట్లు పొడుస్తూ రాజ్యాంగాన్ని నిలువునా పాతరేస్తున్న విద్వేషి హిమంత బిశ్వశర్మ. అతను మాట్లాడే మాటలు, ఆచరణలో వేసే అడుగులు ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా చిత్రీకరించేలా ఉంటాయి. ఈ మధ్య కాలంలో చర్చ జరుగు తున్న అంశం 'సర్'. తమ ఓట్లు చోరీ అయ్యాయని ఓటర్లు ఓవైపు ఆందోళన చేస్తుంటే 'ఇది కచ్చితంగా ముస్లిం ఓట్లను తొలగించేందుకు తీసుకొచ్చిందే' అని హిమంత కుండబద్ధలు కొట్టారు. ఆయన గతంలోనూ ముస్లింల సంస్కృతిని ప్రతిబింబించే 'మియా మ్యూజియం'పై చేసిన వ్యాఖ్యలు సామాజిక వాతావరణంలో అనుమానాలు, భయాలు సృష్టించాయి. ముస్లింల జనాభా పెరుగుదలను ఆ వర్గంపైకి నెట్టి అదో నేరంగా చూపించే ప్రయత్నం చేశారు. భూముల విషయంలో కూడా 'ల్యాండ్ జిహాద్' అంటూ వివాదాస్పదంగా మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలపై సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నేతలు పోలీస్ స్టేషన్లు, కోర్టు పిటిషన్ల దాకా వెళ్లా రు. అయిన ప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు కాలేదంటే అధికార శాసనం ఎలా చెలరేగుతుందో అర్థం చేసుకోవచ్చు. భారతీయ శిక్షాస్మృతి ప్రకారం మతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టే వ్యాఖ్యలు శిక్షార్హం. కానీ, నిత్యం హిందూ ముస్లింల మధ్య 'విభజన రేఖ'ను గీస్తూ ప్రజల్లో విద్వేషం రగిలిస్తున్న హిమంత రోజురోజుకూ రెచ్చిపోయి మాట్లాడటం ఆందోళన కలిగిస్తున్నది. ఇప్పుడు విడుదలైన విజువల్ వీడియో కూడా దాన్ని ప్రేరేపించే విధంగా ఉన్నది. రాజకీయ నాయకుడిది సాధారణ వ్యక్తి మాట కాదు. అది పాలనా దశదిశను చూపిస్తుంది. ఒకవర్గాన్ని టార్గెట్ చేస్తూ చేసే వ్యాఖ్యలు ప్రజల్లో ఒక అభద్రతను తీసుకొస్తుంది. ఎన్నికల చద రంగంలో లాభనష్టాలకు ముస్లింలను పావులుగా వాడుకోవడం, హిందూ,ముస్లింల ఐక్యతను పణంగా పెట్టడం ప్రజాస్వామ్యానికి విఘాతం. ప్రజా సమస్యలను చర్చించకన్నా మతాల మధ్య చిచ్చును పెట్టేందుకే అధికారాన్ని వాడుకోవడం విచాకరం.

భిన్నాభిప్రాయాలున్నా, భిన్న మతాలు ఉన్నా అందరినీ ఒకేతాటిపై నడపాల్సిన బాధ్యత అందరి కన్నా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిది. కానీ, ఇక్కడ హిమంత చేసే 'విద్వేష' వ్యాప్తి ప్రజల్ని కలిపేలా కాకుండా విడదీసే విధంగా ఉంటున్నది. అందుకే హిమంత విజువల్ మత సామరస్యానికి భంగం కలిగించే చర్యగా పేర్కొంటూ సీపీఐ(ఎం), సీపీఐ సహా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. అయితే గౌహతి కోర్టులోనే తేల్చుకోవాలని న్యాయస్థానం సూచించింది. ఈ ఆదేశం "సామాజిక విభజన"ను ప్రేరేపించడమేన్నది పౌర సమాజం అభిప్రాయం. రాజ్యాంగం ఆర్టికల్ 32 ప్రకారం మూల హక్కుల ఉల్లంఘన జరుగుతున్న క్రమంలో పౌరులు ఎవరైనా భారత అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చు. దీన్నే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 'రాజ్యాంగపు హృదయంగా, ఆత్మ'గా పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలు, మత సామ రస్యంపై ప్రభావం చూపే ఆరోపణలు వచ్చినప్పుడు దేశ అత్యున్నత న్యాయస్థానం తక్షణ స్పష్టత ఇస్తే న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడేది. ఈ అంశాన్ని నేరుగా విచారించకుండా 'బదిలీ' చేయటం భరోసాకన్నా ఎక్కువగా బాధను పంచింది. ప్రజాస్వామ్యంలో న్యాయం కనిపించడమే కాదు, కనిపించేలా ఉండటం కూడా అంతే ముఖ్యం. హిమంత విద్వేషాలపై విచారణ చేయాల్సిన అనివార్యత నొక్కిచెబుతున్నది ఇదే.

# పారిశ్రామిక విపత్తులపై అప్రమత్తతకు మాక్ డ్రిల్

**నవతరం -పైడి భీమవరం**



పరిశ్రమల్లో ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి క్షణం అత్యంత విలువైనదని, ముఖ్యంగా క్లోరిన్ వంటి విషవాయువుల లీకేజీ సమయంలో ప్రాణ నష్టాన్ని నివారించడమే ప్రథమ లక్ష్యం కావాలని పరిశ్రమల సంయుక్త తనిఖీ అధికారి శివశంకర్, ఉప ముఖ్య తనిఖీ అధికారి బి. రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం ఉదయం శ్రేయాస్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో సరగడపేట గ్రామంలో నిర్వహించిన భారీ 'ఆఫ్-సైట్' మాక్ డ్రిల్‌లో ఆయన పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విపత్తు సమయాల్లో ప్రజల భాగస్వామ్యం, ముందస్తు అవగాహన ఉంటేనే భారీ ప్రాణనష్టాన్ని నివారించగలమని, పారిశ్రామిక భద్రతే ధ్యేయంగా నిర్వహించిన ఈ మాక్ డ్రిల్ విజయవంతం కావడం పట్ల యంత్రాంగాన్ని.వారు అభినందించారు.

### మాక్ డ్రిల్ సాగిందిలా..

ఉదయం 11:30 గంటలకు పారిశ్రామిక ప్రాంతంలో క్లోరిన్ తరలిస్తున్న వాహనం బోల్తా పడి విషవాయువు దట్టంగా వ్యాపిస్తున్నట్లు సైరన్ మోగడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. పసుపు పచ్చని మేఘంలా వాయువు విస్తరిస్తున్న తరుణంలో, అప్పటికే సమాచారం అందుకున్న ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ప్రాణాలకు తెగించి రంగంలోకి దిగాయి. అపస్మారక స్థితికి చేరుకున్న ఐదుగురు బాధితులను స్ట్రెచర్లపై సమీపంలోని వైద్య శిబిరానికి తరలించడంతో 'ఆపరేషన్ క్లోరిన్' ఉత్కంఠభరితంగా సాగింది.

### విపత్తు వేళ సమన్వయమే బలమని చాటుతూ..

అగ్నిమాపక దళం 'వాటర్ కర్టెన్' ఏర్పాటు చేసి వాయువు వ్యాప్తిని సమర్థంగా అడ్డుకుంది. మరోవైపు శ్రేయాస్ ఈఆర్టీ బృందం రక్షణ కవచాలను ధరించి, 'ఎమర్జెన్సీ డోమ్ క్లాంప్' సహాయంతో లీకేజీని అరికట్టింది. ప్రమాద తీవ్రతను గమనించిన పోలీసులు తక్షణమే రహదారులను దిగ్బంధించి వాహనాలను దారి మళ్లించగా, సరగడపేట గ్రామస్తులను ప్రత్యేక బస్సుల్లో సురక్షిత ఆశ్రయ ప్రాంతాలకు తరలించి వైద్య సేవలు అందించారు. ఈ క్రమంలో అపిటోరియా, అపర్ణ, సరాకా వంటి పొరుగు పరిశ్రమలు తమ అంబులెన్సులు, ఫైర్ టెండర్లను పంపి సహాయక చర్యల్లో తమ వంతు సహాయాన్ని అందజేశాయి.

ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, జిల్లా విపత్తు నిర్వహణ అధికారి రాము, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మోహనరావు, ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్డీఆర్ఎఫ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సీఈవో మనోజ్ శ్రీవాస్తవ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, శ్రేయాస్ హెచ్ ఆర్ పి.మనోజ్, అపిటోరియా నారాయణరావు, డిఆర్ఎల్ సేఫ్టీ ఆఫీసర్ ప్రసాదరావు, ఎన్ ఏ సి ఎల్ సేఫ్టీ హెడ్ వెంకటరాజు, శ్రేయాస్ సీఈఓ మనోజ్ శ్రీ వాస్తవ, శ్రేయాస్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ కన్నారావు రఘునాథరావు పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, ఎస్ఐ చిరంజీవి, ఆపిటోరియా భద్రతాధికారి సంతోష్, దీపక్ మైనింగ్ సొల్యూషన్స్ సేఫ్టీ ఆఫీసర్ గోపీచంద్, ఆపిటోరియా, ఆరో యాక్టివ్, డాక్టర్ రెడ్డీస్, ఎన్ ఏ సి ఎల్, ఆంధ్రా ఆర్గానిక్స్, అపర్ణ ఫార్మా పరిశ్రమల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని డ్రిల్ సందర్భంగా తమకు ఎదురైన అనుభవాలను వివరించారు.

# గొండు గంగాధర్ సేవలకు ప్రశంసలు -ఉంగటి రమణ అభినందనలు

**నవతరం-శ్రీకాకుళం**

తండ్రికి తగ్గ తనయులు గొండు.సోదరులని, గొండు.శంకరన్న శ్రీకాకుళం నగరాన్ని సుందరనగరంగా మార్చటంలో తనదైన శైలిలో దూసుకువవుతూ, అందరి మన్ననలూ పొందుతుంటే గర్వంగా, ఆనందంగా ఉందని, ఇక నేటి జన్మదినం జరుపుకుంటున్న గొండు. గంగాధర్ ప్రముఖ వైద్యుల సరసన చేరి, వైద్యసేవలో చెరగని వేశారన్నారు. స్థానిక మీనాక్షి హాస్పిటల్ లో డాక్టర్. గంగాధర్ ను, టీడీపీ క్లస్టర్ ఇంచార్జి, నగర కార్పొరేషన్ సలహాదారులు, టీడీపి సీనియర్ నాయకులు ఉంగటి.రమణ కేక్ కట్ చేసి, పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భముగా ఉంగటి రమణ మాట్లాడుతూ శ్రీకాకుళంలో పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం చేస్తున్నారని, అనతి కాలంలోనే ప్రముఖ వైద్యులుగా, స్నేహశీలిగా, సేవకునిగా ప్రజల మన్ననలు పొందారన్నారు. భవిష్యత్తులో పేద మధ్య తరగతి కుటుంబాలకు ఆసరాగా వుండాలని, వైద్య రంగములో మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్. గొండు గంగాధర్ మాట్లాడుతూ శ్రీకాకుళం నగరంలో ఉంగటి.రమణ పేరు తెలియని వారు ఎవరూ ఉండరని, మంచి మనిషిగా ప్రజలకు చేరువయ్యారని, సహాయం అడిగిన వారికి, అండగా ఉంటూ నేనున్నానని భరోసా కల్పిస్తూ మంచి మనసున్న మారాజు అన్నారు. అటువంటి వ్యక్తి ప్రత్యేకంగా నన్ను కలసి శుభాకాంక్షలు తెలియజేయటం ఒక బహుమతిగా స్వీకరిస్తున్నానని తెలిపారు.

ఈ కార్యక్రమములో గంగు పెద్ద రమణ, గొలివి.ధనుంజయ్, ప్రియా చిట్టిబాబు, దాస్యం నాని, ఆయన అభిమానులు, వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**నవతరం-శ్రీకాకుళం**

నెం.5 శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలో వున్న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఫిబ్రవరి నెలకు శనివారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం పరిపాలన అధికారి లక్ష్మినారాయణ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడమైనది. సదరు సమావేశములో వోటర్ల జాబితాలో వున్న మసకబారిన, తెలుపు రంగులలో వున్న, చిరునామా తప్పుగా వోటర్ల కార్డులను గుర్తింపు చేసి సంబంధించి బూత్ లెవెల్ అధికార్లు ద్వారా వారి నుండి ఫారం - 8 - 637 తీసికొని సరిచేసినట్లు వివరించారు. మరణించిన, డబల్ వోటర్లను ఫారం - 7 ద్వారా 324 తొలిగించుట, మాపింగ్ ప్రక్రియ 50.68 % పూర్తి అయినదని, అన్ని రాజకీయ పార్టీల వారికి తెలియచేసి వివరాలతో కూడిన కాపిలు సమవేశంలో ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఒక మంచి ఓటరు జాబితా తయారీకి, మాపింగ్ గురించి తగు సూచనలు, సలహాలు ఇవ్వవలసినదిగా రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులకు కోరారు. ఈ సమావేశంలో తహసిల్దార్ గణపతి, శ్రీకాకుళం, జి.కె.శ్రీనివాసరావు - ఎన్నికల ఉప తహసిల్దార్ , కాంగ్రెస్ - ఈశ్వరి శంకరరావు, తెలుగుదేశం పార్టీ నుండి వెంకటేష్, జనసేన పార్టీ నుండి భాస్కరరావు, దీజీపీ పార్టీ నుండి అసిరినాయుడు, భుషనరావు, లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# మన మూలాలు మరచిపోకూడదు

## - గురజాడ విద్యాసంస్థల సంచాలకులు సంయుక్త




**నవతరం-శ్రీకాకుళం**

మాతృభాషను మరచిపోతే మన మూలాలును వదలివేసినట్టే'నని గురజాడ విద్యాసంస్థల సంచాలకులు సంయుక్త అన్నారు. గాయత్రి కాలేజీ అఫ్ సైన్స్ అండ్ మేనేజ్ మెంట్ కళాశాల తెలుగు విభాగం నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని, నూతన విద్యావిధానంలో మాతృభాషకు ఇచ్చిన ప్రాధాన్యత, అనేక శాస్త్రాలను మాతృభాషలోకి తీసుకువచ్చె ప్రయత్నం జరుగుతున్నదని ఆమె అన్నారు. ముఖ్య వక్తగా పాల్గొన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వావిద్యాలయం తెలుగు ఆచార్యులు డా. కె. ఉదయకిరణ్ 'నేటి విద్యార్థులకు సృజన ఉన్నదని, అది భాషా పరంగా వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులను కోరారు. ప్రముఖ కవి కశీచరానా భుజంగారావు రచించిన, గీసి చెరిపిన బొమ్మ పుస్తకంపై విశ్లేషణ చేసారు. విద్యార్థులు మహాలక్ష్మి, తేజస్వని భాష గురించి మంచి విషయాలు చెప్పగా, అతిధులను దుస్సాలువాలతో సత్కరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.వి. సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐ. క్యూ.ఏ.సి. డా. మార్తాశీడ కృష్ణ, తెలుగు విభాగధిపతి భమిడిపాటి గౌరిశంకర్, అప్పలనాయుడు, గోపాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

- పరిసరాలు పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుంది నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు
- ప్లాస్టిక్ వద్దు పేపర్ బ్యాగులు ముద్దు..
- ప్లాస్టిక్ ను నివారిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం...



**నవతరం-పాతపట్నం**

పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి మండలం హై స్కూల్ ఆవరణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న పాతపట్నం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ శ్రీ మామిడి గోవిందరావు గారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే చక్కని ఆరోగ్యం సొంతమవుతుందని, పరిసరాలను శుభ్రంగా చేసుకోవడం అందరూ బాధ్యతని, అందరూ బాధ్యతగా స్వర్ణాంధ్ర సచ్చాంద్ర నిర్మాణానికి కృషి చేయాలని కోరారు."స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివాస్" నినాదంతో జరుగుతున్న ఈ ఉద్యమం మన పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో ప్రతి ఒక్కరిని ప్రేరేపిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక నాయకులు,ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జై తెలుగుతల్లి..! జైజై తెలుగుతల్లి..!!



నా తెలుగు...నాకు వెలుగు...!
నా తెలుగు...నీతికి వెలుగు...!
నా తెలుగు...జాతికి వెలుగు..!
నా తెలుగు...ప్రగతికి వెలుగు..!
నా తెలుగు...జగతికి వెలుగు..!

నా తెలుగు జాతి...
అపురూపం... అది
ప్రేమకు ప్రతిరూపం..!
అది అల్లూరి ఆవేశానికి
బ్రహ్మనాయుడు నాగమ్మల
పల్నాటి పౌరుషానికి ప్రతిబింబం..!

నా తియ్యని
తేనియల తెలుగు...
కోటి అందాల కోన సీమ..!
రాగిముద్దల రాయల సీమ..!
రామప్పగుడిలో
మ్రోగే రసరాగ తరంగిణి
రామ్యరాగాల తెలంగాణ రుద్రవీణ..!

నా తెలుగు నేల...
గలగలపారే గంగా గోదావరి
కృష్ణ కావేరీ నదుల సంగమం..!

నా తెలుగు భాష నాకు వరం..!
అది విశ్వానికి వెలుగు కిరణం..!

నా తెలుగు భాష సొగసు...
తిరుమలగిరి సుందర మందిరాన
శ్రీ బాలాజీకి దిద్దిన శ్రీహరి తిలకం..!

నా తెలుగుతల్లి చల్లని ఒడి...
నాకు ఒక గుడి నాకు ఒక
బడి..!
అది పచ్చదనాల సమతా
మమతల
సస్యశ్యామల నవజీవన
నారుమడి..!

నా ప్రతి తెలుగుపదం...
నవనీతం నవరస భరితం..! అది
త్యాగయ్య క్షేత్రయ్య అన్నమయ్య
కీర్తనల్లో పల్లవించే
ప్రణవనాదం..!

నా తెలుగు వైభవం...
నన్నయ్య తిక్కన ఎఱ్ఱా ప్రగడల
పోతన వేమన శ్రీనాథ విశ్వనాథ
గిడుగు గుఱ్ఱం జాషువా గురజాడ
శ్రీశ్రీ సినారే ఆత్రేయ దాశరథి
కావ్యకన్యల సుగంధ సౌరభం..!
నా తెలుగు జాతి...
కీర్తిప్రతిష్టలు...విశ్వ వేదికలపై
నర్తించు నటరాజు మువ్వలసవ్వడులు..!
నా తెలుగు యాసలో...ఎన్నెన్ని
హైదరాబాద్ బిర్యానీ ఘుమఘుమలో..!
ఎన్నెన్ని ముత్యాల వజ్రాల మిళమిళలో..!

నా తెలుగు అక్షరం...నవ్వే నక్షత్రం..
విశ్వ విహంగం.. ప్రేమ పతంగం..
గలగల పారే గంగా ప్రవాహం..
గగనసీమలో వినిపించు
గంధర్వగానం..!
ఖండాంతరాలలో ఎగిరే
శాంతికపోతం...!
జై తెలుగుతల్లి..! జైజై తెలుగుతల్లి....!
జయహో జయహో తెలుగు తల్లి..!



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# మరణం లేని మాతృభాష




మాతృభాష కళామతల్లి
నీకు వందనం !
పాదాభివందనం !!

అమ్మ తెలుగు భాష
కళామతల్లి......
తరతరాల నుండి మా
నరనరాల్లో......
అన్య భాషలు
జీర్ణించుకుపోయినాయి.
మాతృభాషపై మమకారం
మందగించి.....
ఆంగ్ల భాషలపై మోజు
పెంచుకున్నాం.
అయినా...
మాతృభాషా దినోత్సవం
ఘనంగా జరుపుకుంటున్నాం.

కవులు నీపై కమ్మని
కవిత్వాన్ని వ్రాస్తున్నారు.
గాయకులు నీపై రమ్యమైన
గేయాలు ఆలపిస్తున్నారు.
పండితులు నీ పైన పద్య
కుసుమాలు వెదజల్లుతున్నారు.
రచయితలు రమ్య శైలిలో
రచనలు చేస్తున్నారు.
ఉపన్యాసకులు తెలుగు
భాష పై
అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు.
మేధావులు ,శాస్త్రవేత్తలు,
కవి పండిత గేయకులు
అందరూ నిన్ను కీర్తిస్తున్నారు
నీ భాష వైభవాన్ని
శ్లాఘిస్తున్నారు

నీకేం తల్లి.....!
నిత్య సౌభాగ్యవతివి.
నిర్మల మతివి.
తెలుగు ప్రాచీన
భాషగా
హోదా పొందిన
దానివి.

ఇంతలో......
నీకేమైంది తల్లీ ....!
?
హఠాత్తుగా
కొందరు.....
తెలుగు భాషను
రక్షించుకుందాం !
తెలుగు భాషను
బ్రతికించుకుందాం
!!
తెలుగు భాషను
కాపాడుకుందాం
అంటున్నారు....
అరుస్తున్నారు.

వాళ్లకేం తెలుసు.....!?
"నీకు జననం తప్ప
మరణం లేదు"

ఓ భాషా కళమా తల్లీ
పరభాష సంకెళ్లు
తొలిగేదెప్పుడో ...!?
మధురమైన తెలుగు
సంపదను.....
తెలుగుజాతి గుండెల్లో....
నిండుగా నిన్ను కీర్తించి
మంగళ
హారతులెత్తేదెప్పుడో...!!
పరిపాలనా వ్యవస్థలో
మార్పు వచ్చినప్పుడు....
తెలుగు భాష అమలైనప్పుడు
నీకు అభిషేకం...
ఆనాడే....పట్టాభిషేకం.



" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు

# "హాయ్" బల్వంత్!

**మూవీ రివ్యూ: హే బల్వంత్**
**రేటింగ్: 2.75/5**
**తారాగణం: సుహాస్, శివాని నాగరం, నరేష్, వెన్నెల కిషోర్, అజయ్ ఘోష్, అన్నపూర్ణ, సుదర్శన్, హర్షవర్ధన్, రాకెట్ రాఘవ, స్రవంతి చొక్కారపు తదితరులు**
**సంగీతం: వివేక్ సాగర్**
**ఎడిటింగ్: విప్లవ్ నైషధం**
**కెమెరా: మహిరెడ్డి**
**నిర్మాత: నరేంద్ర రెడ్డి**
**దర్శకత్వం: గోపి అచ్చర**
**విడుదల: 20 ఫిబ్రవరి 2026**

సుహాస్ వలన కొంత, "లిటిల్ హార్ట్స్" హీరోయిన్ శివాని వల్ల ఇంకొంత, ఈ మధ్యన కేరెక్టర్ ఆర్టిస్ట్ గా జెన్ జీ ని ఆకట్టుకుంటున్న నరేష్ వల్ల మరికొంత ఈ చిత్రంపై అటెన్షన్ ఏర్పడింది. పైగా "హే భగవాన్" నుంచి "హే బలవంత్" అని సెన్సార్ వాళ్లు టైటిల్ మార్చమనడం, దీనికి "ఎ" సర్టిఫికేట్ ఇవ్వడం వెనుక కథలో ఒక కారణముందన్న ప్రచారం కాస్త ఆసక్తిని పెంచాయి. ఇంతకీ కథా కమామిషు ఏంటో చూద్దాం.

కథలోకి వెళితే కృష్ణ (సుహాస్) కి చిన్నప్పటి నుంచీ బిజినెస్ మ్యాన్ అయిన తన తండ్రి బలవంత్ రావు (నరేష్) హీరో. ఏం బిజినెస్ చేస్తాడో మాత్రం కృష్ణకి తెలీదు. ఎందుకంటే తండ్రి చెప్పడు. నాయనమ్మ (అన్నపూర్ణ) కి కూడా సరిగ్గా తెలీదు కానీ, ఎందరో ఆడవాళ్లకి బతుకునిస్తున్నాడు అంటూ ఏదో చెబుతుంది. ఎప్పటికైనా తన తండ్రి బిజినెస్ ని టేకోవర్ చేసుకోవాలని కృష్ణకి బాల్యం నుంచీ కల. మొత్తానికి పెద్దయాక ఒక సన్నివేశంలో తండ్రి చేస్తున్న బిజినెస్ ఏమిటో తెలుస్తుంది కృష్ణకి. ఆ విషయాన్ని డైజెస్ట్ చేసుకోవడానికి కృష్ణ ఎంత ఇబ్బంది పడ్డాడు, అప్పటికే తాను ప్రేమిస్తున్న మిత్ర (శివాని) కి ఈ విషయం తెలియకుండా దాయడానికి ఎలాంటి కష్టాలు పడ్డాడు అనేది సరదాగా సాగిన ట్రాక్. ఆ తర్వాత మరికొన్ని పాత్రలు కథలో రివీల్ కావడం, వాళ్ల ప్రమేయంతో కృష్ణ-మిత్ర చివరికి ఒకటవ్వడం, బలవంత్ రావు బిజినెస్ వెనకాల ఉన్న మానవీయ కోణం చెప్పడం- తక్కిన కథ.

కథకంటే కథనంతో అలరించే అవకాశం ఎక్కువున్న పాయింటిది. కథనం రాసుకోవడం కూడా అలానే ఉంది. అయితే కామెడీకి పెద్ద పీట వేస్తూ సాగిన ఈ చిత్రాన్ని క్లైమాక్స్ లో మాత్రం బరువైన సన్నివేశాలతో, సెంటిమెంటుతో నింపేయడం గ్రాఫ్ ని కాస్త డౌన్ చేసింది. ఆ సన్నివేశాలే పెట్టాలనుకుంటే వాటిని కథనంలో ఆఖరి పావుగంటకి ముందు వరకు పెట్టి, ఆ తర్వాత పూర్తి హిలారియస్ గా నడిపేలా రాసుకుని ఉంటే బాగుండేది. టైటిల్స్ పడ్డ తర్వాత నవ్వుకుని, సెకండాఫులో కాస్త బరువైన కథనాన్ని మోసినా, మళ్లీ క్లైమాక్స్ లో నిండుగా నవ్వుకుంటూ బయటికి వస్తే సంతృప్తికరంగా ఉండేది.

మరింత బెటర్ ఎక్స్పీరియన్స్ ఇవ్వగలిగే అవకాశమున్నా క్లైమాక్స్ అలా బరువెక్కించారన్న మాట తప్ప, తక్కిన సినిమా అంతా లాజిక్కులు పక్కనపెట్టి చూస్తే సెన్సిబుల్ గానే ఉంది.

ఈ సినిమా చూస్తున్నంతసేపూ రకరకాల ప్రశ్నలు తడుతుంటాయి. అయితే సంభాషణలతోటీ, ఆర్టిస్ట్స్ టైమింగ్ తోటి, సరదాగా నడిపిస్తూ లాజిక్ ని పక్కకి నెట్టే మ్యాజిక్ ని క్రియేట్ చేసాడు దర్శక రచయిత.

నటీనటుల విషయానికి వస్తే, సుహాస్ తన పాత్రకు పూర్తి న్యాయం చేసాడు. అయితే ప్రత్యేకమైన తన ఇంపాక్ట్ పెద్దగా కనపడలేదు. ఈ పాత్రలో అతను కాకుండా ఇంకెవరున్నా కూడా పెద్దగా తేడా ఉండేది కాదు




అనిపించింది. హీరోయిన్ శివాని ప్లస్ పాయింట్. లిటిల్ హార్ట్స్ తో తాను సంపాదించున్న ఇమేజ్ వల్ల స్క్రీన్ మీద ఆమె కనపడగానే ఆడియన్స్ స్పందన బాగుంది. నటన కూడా బాగా చేసింది. ఇలాంటి కామెడీ టచ్ ఉన్న పాత్రల్లో ఆమె టైమింగ్ బాగుంటుందని మరో సారి తెలిసింది.

హీరో ఫ్రెండ్ గా సుదర్శన్ ది ఫుల్ టైం ప్రెజెన్స్. ఆద్యంతం ఆకట్టుకున్నాడు.

అజయ్ ఘోష్ చాలా ఇంపాక్ట్ఫుల్ గా కనిపించాడు.

తన గాత్రంతోటి, లుక్ తోటి ఆకట్టుకున్నాడు. ఒకరకంగా చూస్తే సెకండాఫ్ మొత్తం కథనాన్ని కేరీ చేసాడు. ఈ చిత్రానికి ప్రధానమైన అసెట్ గా నిలిచాడు.

హర్షవర్ధన్ కూడా తన పాత్రతో, ప్రెజెన్స్ తో స్క్రీన్ వేల్యూ పెంచాడు.

నరేష్ కూడా అటెన్షన్ పుల్లరే. ఇలాంటి పాత్ర తనకే సెట్టవుతుందనిపించేలా ఉంది. బలకృష్ణని ఇమిటేట్ చేసిన సీన్ అయినా, పోకిరిలో మహేష్ బాబు ఎంట్రీ సీన్ ని అనుకరించినా బాగుంది. ఆద్యంతం ఆడియన్స్ ని ఎంగేజ్ చేసేలా ఉంది నరేష్ నటన.

వెన్నెల కిషోర్ కూడా మంచి రిలీఫిచ్చాడు.

అన్నపూర్ణమ్మ ఓకే. బాబు మోహన్ ది డైలాగ్-లెస్ పాత్ర. రెండు సీన్స్ లో మాత్రం కనిపించినా సినిమాలో ముప్పావు భాగం ఈ పాత్ర చుట్టూనే నడుస్తుంది.

యాంకర్ స్రవంతి చొక్కారపు తను పోషించిన పాత్రని చాలా కన్విన్సింగ్ గా ప్రెజెంట్ చేసింది. టెక్నికల్ గా చూస్తే వివేక్ సాగర్ సంగీతం పాటలకంటే నేపథ్యానికే బెటర్ అని మరో సారి రుజువయ్యింది. పాటలో సాహిత్యం వినపడకుండా దరువేయడం బాలేదు.

ఎడిటింగ్, కెమెరా వగైరాల్లో వంక పెట్టడానికేం లేదు. సంభాషణల విషయానికొస్తే, మొదట్లో "సిద్ధాంతి-వేదాంతి" లాంటి డైలాగ్స్ మరీ రొటీన్ గా ఉన్నాయనిపించినా.. క్రమంగా మంచి సంభాషణలు వినిపించాయి.

"చితి కే కదా పోయేది...చితికి పోతే ఏంటి?" అనే లైన్ కావొచ్చు; "సమిధ-ప్రమిద-సమాధి" లాంటి పదక్రీడ కావొచ్చు; "ఏ 'చికిత్సా' గుమస్తాస్" అంటూ దానికి వెన్నెల కిషోర్ చెప్పిన అర్థం కావొచ్చు..; రక్షిత్ శెట్టి, కృతి శెట్టి...అంటూ అజయ్ ఘోష్ ఇంట్లో జరిగిన సీన్ తాలూకు సంభాషణలు ...అన్నీ సందర్భోచితంగా నవ్వించాయి.

ప్రధమార్ధం సరదాగా సాగి, ద్వితీయార్ధం ముప్పావు భాగం కూడా అలానే ఉండి, ఆఖరి భాగం మాత్రం బరువెక్కించి వదిలిన చిత్రమిది. కామెడీకి కాస్తంత హ్యూమన్ టచ్ ఇచ్చి రాసుకున్న కథనం. ప్రస్తుతం చట్టవిరుద్ధమైన ఒక వ్యాపారానికి జస్టిఫికేషన్ ఇచ్చినట్టు తీసారు.

అందుకే ఈ చిత్రానికి "ఎ"సర్టిఫికేట్ ఇవ్వడమయ్యింది. సినిమా చూసాక ఎందుకొచ్చామా అని మాత్రం అనిపించదు. చూస్తున్నంత సేపూ పగలబడి కాకపోయినా, సరదాగా నవ్వుకోగలుగుతూ పర్వాలేదనిపించే కాలక్షేప చిత్రం ఇది. కాసేపు "హాయిగా నవ్వుకుంటూ కాలక్షేపం చేయాలనుకుంటే ఈ "హే బల్వంత్" కి థియేటర్ కి వెళ్లి "హాయ్" చెప్పి చూడొచ్చు.

# "మాచన"కు చండీఘర్ ఆహ్వానం

**నవతరం శ్రీకాకుళం :**

అలుపెరుగని సాధన,స్వార్థం ఎరుగని తపన కు చిరునామా మాచన రఘునందన్ కు మరో అరుదైన గౌరవం దక్కింది."పొగాకు నియంత్రణ లో నవీన పద్ధతులు" ,అనే అంశం పై పంజాబ్ రాష్ట్రం చండీఘర్ లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సు కు ఆహ్వానం అందింది. రిసోర్స్ సెంటర్ ఫర్ టుబాకో కంట్రోల్ (ఆర్ సి టి సి) ఈ సదస్సు ను మార్చి రెండో వారం లో నిర్వహిస్తోంది.కాగా ఈ కార్యక్రమం లో పాల్గొనే వారినుంచి ఆర్ సి టి సి వారి కృషి తాలూకు వివరాలను ఇప్పటికే సేకరించింది.క్షేత్ర స్థాయిలో ఆయా వ్యక్తులు, సంస్థలు పొగాకు నియంత్రణ కు గాను అవలంబిస్తున్న/అనుసరిస్తున్న విధానాల తాలుకు పద్ధతుల ను జాతీయ స్థాయి సదస్సు లో ప్రదర్శిస్తారు.

పూర్తి స్థాయి ఉపకార వేతనం తో ఈ సదస్సు లో పాల్గొనే అవకాశం మాచన రఘునందన్ దక్కింది.

ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ..22 ఏళ్లుగా పొగాకు నియంత్రణ కు కృషి చేస్తూ..2025 ఆగస్టు లో టుబాకో కంట్రోల్ హీరో అవార్డు కు ఎంపికైన ఘనత తో పాటు ఆర్ సి టి సి సదస్సు కు ఆహ్వానం అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# 10వ తరగతి విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ





**నవతరం-టెక్కలి**

టెక్కలి మండలం లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్, తలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతూ ప్రతి విద్యార్థికి ప్లాంక్,పెన్, పెన్సిల్ పంపిణీ కార్యక్రమం ధోనీ బుజ్జి, వాకాడ శ్రీధర్, లాడి కామేశ్వరరావు చేతుల మీదుగా చేసినట్లు అభయం యువజన సేవా సంఘం అధ్యక్షులు దేవాది శ్రీనివాసరావు తెలియజేశారు.

టెక్కలి మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాల లో సుమారు1500 మందికి స్టేషనరీ పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ఈ కార్యక్రమానికి సహాయం అందించిన దాతలందరికీ అభయం యువజన సేవా సంఘం తరఫున ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో అభయం సేవా సంఘ అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సెక్రటరీ లాడె కామేశ్వర రావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, అద్దాల వీరభద్రాచారి పాల్గొన్నారు.

# డాక్టర్ సిదిరి అప్పలరాజు పుట్టినరోజు వేడుకలు విజయవంతం చేయండి

## వైఎస్ఆర్సీపి మందస మండలం యువజన అధ్యక్షుడు సేనాపతి కిషోర్ పిలుపు



**నవతరం-మందస**

వైఎస్ఆర్సిపి రాష్ట్ర నేత, మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పుట్టినరోజు సందర్భంగా ఫిబ్రవరి 22వ తేదీన మందసలో వైయస్సార్సీపి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు జరగనున్నాయని వైఎస్ఆర్సిపి మందస మండల యువజన అధ్యక్షులు సేనాపతి కిషోర్ అన్నారు.

శనివారం మందసలో ఆయన మాట్లాడుతూ, తొలుత వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం బర్త్ డే కేక్ కటింగ్ జరుగుతుందని, ఈ కార్యక్రమానికి స్థానిక మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్ఆర్సిపి గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్లు, నియోజకవర్గం తోపాటు, రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ పదవులు లో ఉన్న వైయస్సార్సీపి ముఖ్య నేతలు పుట్టినరోజు వేడుక కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని జానపద కిషోర్ కోరారు.

## స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పండితులకు.. సాహితీ వేత్తలకు.. కళాకారులకు సత్కారం

# అమ్మలాంటి కమ్మనైన మాతృభాషను కాపాడుకోవాలి..



**నవతరం శ్రీకాకుళం :**

అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యాల్ల పోలినాయుడు ,స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరాప్రసాద్.. పీజీ గుప్తా.. శాసపు జోగినాయుడు.. అన్నారు. మాతృభాషను విస్మరిస్తే పుట్టగతులు ఉండవని.. భాషాభిమానులు అంతా మాతృభాష పరిరక్షణకు పాటుపడాలని కోరారు.. తెలుగుభాష గొప్పదనం.. తెలుగు భాషే మన మూలధనం అనే విషయాన్ని అందరూ గ్రహించి రోజురోజుకీ అంతరించిపోతున్న మాతృభాషను కాపాడుకోవడానికి ప్రయత్నం చేయాలని కోరారు.. శనివారం శ్రీకాకుళం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవ వేడుకలు మరియు ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. సీనియర్ జర్నలిస్ట్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన సభలో.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు మాట్లాడుతూ.. పరభాషా మోజులో పడి మాతృభాషను విస్మరించే సంస్కృతికి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. తెలుగుభాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు.. ప్రపంచంలో ఏడువేలకు పైగా భాషలు ఉన్నాయని.. అందులో అనేక భాషలు అంతరించిపోయే ప్రమాదమలో ఉన్నాయని.. అందుకే మాతృభాష సంరక్షణ అనేది జాతి బాధ్యతగా భావించాలి అన్నారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాతృభాష అభివృద్ధికి బాటలు వేయాలని వక్తలు అంతా ముక్తకంఠంతో కోరారు.. ఈ సందర్భంగా మాతృభాష సంరక్షణకు పాటుపడుతున్న పలువురు సాహితీ వేత్తలు పైడి హరనాథ్ రావు.. భాస్కరభట్ల శ్రీరామ్మూర్తి.. భమిడిపాటి గౌరీశంకర్ లను స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించి.. సమాజానికి వారు అందించే సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.. ఇదిలా ఉండగా ప్రపంచ రంగస్థల కళాకారుల దినోత్సవము సందర్భముగా.. సీనియర్ రంగస్థల కళాకారులు మల్లెమొగ్గల లక్ష్మి.. జ్యోతిరాణి.. ఆశాలత లను సత్కరించారు.. ఈ సందర్భంగా పలువురు వాకర్స్ ప్రముఖులు మాట్లాడుతూ.. కలారంగాన్ని నమ్ముకొని జీవనం సాగించే కళాకారులు అభ్యున్నతికి కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు..ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు డాక్టర్ మంతెన వాసుదేవాచారి.. గోలీ ఉమామహేశ్వరరావు.. డాక్టర్ బొడ్డేపల్లి ప్రసాదరావు.. వావిలపల్లి జగన్నాథనాయుడు.. సుగంధం సంజీవరావు.. గద్దెబోయిన కృష్ణ.. అశోక్.. బోషు మన్మథ మాదిగ.. డి. కృష్ణారావు.. మల్లిబాబు.. తౌడు..మోహన్.. శేఖర్.. నాగేశ్వరరావు.. వికాస్ విద్యా సంస్థలు అధినేత కూన వేణుగోపాల రావు తదితరులు పాల్గొన్నారు..

## ఏ పి ఇ డబ్ల్యూ ఐ డి సి, డైరెక్టర్ పి ఎం జె బాబు

# చెత్త రహిత నగరంగా చేసే భాద్యత అందరిదీ



**నవతరం శ్రీకాకుళం :**

మున్సిపల్ కమీషనర్ ఆదేశాలు మేరకు స్థానిక ఆదివారంపేట సచివాలయం పరిధిలో వరం కాలనీ పార్కు వద్ద సచివాలయం సిబ్బంది స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రత పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పార్కు పరిసరాల్లో ఉన్న చెత్తను తొలగించారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పి ఎం జె బాబు మాట్లాడుతూ శ్రీకాకుళం పట్టణాన్ని చెత్త రహిత నగరంగా ఉంచడానికి అందరూ భాద్యత వహించాలని, ప్లాస్టిక్ సంచులు వాడ రాదనీ, పాడుపడిన ఎలక్ట్రికల్ వ్యర్థాలను తొలగించాలని జిల్లా బిస్త్రుఖుఖు ఖసూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర సాధనలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉధ్యాన అధికారి రత్నాల వరప్రసాద్, ధర్మారావు, వెనకటనారాయణ, నాయుడు, సచివాలయం సిబ్బంది జ్ఞానేష్, భారతి, శివాజీ, చిరంజీవి, సంతోష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు రెండు లక్షల రూపాయలు తన వ్యక్తిగత నిధులతో ప్రయాణ ఖర్చులను ,కిట్ మరియు క్రీడా దుస్తులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్

# మరోసారి తన మంచి మనసు పెద్ద మనసు చాటుకున్న ఎమ్మెల్యే రవికుమార్






**నవతరం- ఆముదాలవలస**

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో జగ్గుశాస్త్రుల పేట వద్ద ఉన్న NTR Green Field Stadiumలో నిర్వహిస్తున్న సౌత్ జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంప్ (మెన్ - ఉమెన్) కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగుతుంది. ఈ కోచింగ్ క్యాంప్‌కు గౌరవ ఆముదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ మరియు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కూన రవికుమార్ గారు హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులు వసతుల సదుపాయం కోసం ఆయన తన వంతు సహాయాన్ని ముందుగానే అందజేశారు. క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గ్రామీణ ప్రాంతాల నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీయడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే గారు తెలిపారు. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాష్ట్రం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని ఇంకా ఉన్నతమైన అవార్డులు భవిష్యత్తులో సాధించాలని దానికి తన వంతు కృషి సహాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కోచింగ్ క్యాంప్‌లో సౌత్ జోన్‌కు చెందిన పురుష మరియు మహిళా క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందుతున్నారు.

అనుభవజ్ఞులైన కోచ్‌ల మార్గదర్శకత్వంలో జరుగుతున్న ఈ శిబిరం క్రీడాకారుల నైపుణ్యాలను మరింత మెరుగుపరచడానికి దోహదం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు,క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత మరియు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**